సాక్షి
విశాఖపట్నం
మంగళవారం । 25 । ఫిబ్రవరి । 2025



బకాయిలు వసూలు చేయాలి

ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న బకాయిలను వసూలు చేయాలని వీఎంఆర్‌డీఏ కమిషనర్ విశ్వనాథన్ ఆదేశించారు. 8లో



ఆవేదనే.. ఆలంబనై..

రోడ్డు ప్రమాదంలో భార్య, కుమార్తెను కోల్పోయిన శ్రీరామ్ నేడు ఎందరో పేదల జీవితాల్లో వెలుగులు నింపుతున్నారు. 8లో

విశాఖకు మల్లన్న తలపాగా



శ్రీశైలం మల్లన్న తలపాగా విశాఖ చేరుకుంది. అల్లిపురంలో రెండు రోజుల పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. 8లో

న్యూస్‌రీల్

వాల్తేర్ డివిజన్ డీఆర్ఎంగా లలిత్ బోరా బాధ్యతల స్వీకరణ



తాటిచెట్లపాలెం: ఈస్ట్ కోస్ట్ రైల్వే వాల్తేర్ డివిజన్ డీఆర్ఎంగా లలిత్ బోరా సోమవారం బాధ్యతలు చేపట్టారు. 1998 బ్యాచ్ ఐఆర్‌టీఎస్ అధికారైన లలిత్ న్యూ అండ్ రెన్యువబుల్ ఎనర్జీ మంత్రిత్వ శాఖలో జాయింట్ సెక్రటరీగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఐఐటీ బొంబాయి నుంచి బీటెక్(ఎలక్ట్రికల్ ఇంజినీర్), బిట్స్ పిలానిలో ఎంబీఏ(ఫైనాన్స్) పూర్తి చేశారు. రైల్వేలో చీఫ్ కమర్షియల్ మేనేజర్, చీఫ్ పాసింజర్ ట్రాన్స్‌పోర్టేషన్ మేనేజర్, చీఫ్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్, డిప్యూటీ జనరల్ మేనేజర్‌గా గతంలో ఆయా ప్రాంతాల్లో పనిచేశారు. వాల్తేర్ డివిజన్ డీఆర్ఎంగా పనిచేసిన సౌరబ్ ప్రసాద్ లంచం తీసుకొని దొరికిపోయి సీబీఐ కేసుల్లో ఇరుక్కున్నారు. అప్పటి నుంచి ఏడీఆర్ఎం మనోజ్‌కుమార్ సాహూ డీఆర్ఎంగా ఉన్నారు. లలిత్ బోరాను డీఆర్ఎంగా డిసెంబర్ 26న రైల్వే బోర్డు నియమించగా సోమవారం ఆయన బాధ్యతలు చేపట్టారు.

ఎమ్మెల్సీ ఎన్నికల సిబ్బందికి రెండో విడత ర్యాండమైజేషన్



ర్యాండమైజేషన్ నిర్వహిస్తున్న కలెక్టర్

సాక్షి, విశాఖపట్నం: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల విధుల నిర్వహించే సిబ్బందికి రెండో విడత ర్యాండమైజేషన్ ప్రక్రియ సోమవారం పూర్తయింది. కలెక్టరేట్‌లోని ఎన్ఐసీ కేంద్రం నుంచి ఆన్‌లైన్ ప్రక్రియ ద్వారా జిల్లాలోని 13 పోలింగ్ కేంద్రాలకు 13 మంది పీవోలను, 13 మంది ఏపీవోలను, 26 మంది ఓపీవోలను కలెక్టర్ హరేందిరప్రసాద్ కేటాయించారు. అదనంగా 20 శాతం అంటే.. మరో 10 మంది సిబ్బందిని కూడా కేటాయిస్తూ ర్యాండమైజేషన్ ప్రక్రియ నిర్వహించారు. విధులు కేటాయించిన వారందరికీ అధికారిక పత్రాలను అందజేశారు. అనంతరం డీఆర్‌వో బీహెచ్ భవానీ శంకర్, శిక్షణ నోడల్ అధికారి సుధాసాగర్ ఆధ్వర్యంలో పీవో, ఏపీవో, ఓపీవోలకు ఎన్నికల విధుల నిర్వహణకు సంబంధించిన శిక్షణ నిర్వహించారు.

28 వరకు ప్రత్యేక ఆధార్ నమోదు

బీచ్‌రోడ్డు: జిల్లాలో ప్రత్యేక ఆధార్ నమోదు కార్యక్రమాన్ని ఈ నెల 28వ తేదీ వరకు నిర్వహించనున్నట్టు కలెక్టర్ హరేందిరప్రసాద్ పేర్కొన్నారు. 121 గ్రామ/వార్డు సచివాలయం, 13 పోస్టల్ డిపార్టమెంట్ల ద్వారానే కాకుండా జిల్లాలోని 20 కామన్ సర్వీస్ సెంటర్ల ద్వారా ఈ క్యాంపులను నిర్వహించాలని ఆదేశించారు. జిల్లాలో బర్త్ సర్టిఫికెట్లు ఉండి బాలాధార్ కార్డుకు దరఖాస్తు చేయని పిల్లల సంఖ్య 3,200కి పైగా ఉందని, అలాగే లక్షకుపైగా పిల్లలకు ఆధార్ బయోమెట్రిక్ అప్‌డేట్ చేయాల్సి ఉందని తెలిపారు. వారంతా ఆధార్ అప్‌డేట్ చేసుకోవాలని సూచించారు.

• వి-ఫామ్‌తో ఇంధనం ఆదా

వేటకు ఊతం

చేపల వేటకు వెళ్లే మత్స్యకారులకు ఇంధన వినియోగమే పెద్ద సమస్యగా మారింది. వల నిండాలంటే సముద్రానికి ఎదురీదుతూ బోటు దూసుకుపోవాలి. అలా వెళ్లాలంటే ఇంజిన్‌పై భారం పడుతుంది. ఈ సమయంలోనే మంచినీళ్లలా డీజిల్ ఖర్చయిపోతుంది. దీనికి చెక్ పెడుతూ సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఫర్ ఫిషరీస్ టెక్నాలజీ(సీఐఎఫ్‌టీ) కొత్త పరికరాన్ని తీసుకొచ్చింది. సాధారణంగా చేపల వేట బోట్లలో వినియోగించే ఓటర్ బోర్డులను విభిన్నంగా డిజైన్ చేసి.. భారీగా ఇంధనాన్ని ఆదా చేసేందుకు కొత్త మార్గాన్ని సృష్టించింది.

- ఓటర్ బోర్డులను రూపొందించిన సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఫిషరీస్ టెక్నాలజీ
- మత్స్యకారుల బోట్లకు ఈ బోర్డుల అమరిక
- చేపల వేటకు వెళ్లే సమయంలో బోటు కదలికలు సులభతరం
- యురోపియన్ ట్రాల్స్ తరహాలో ఏర్పాటుకు మార్గం సుగమం
- 8 గంటల వేటలో 17 నుంచి 24 లీటర్ల ఇంధనం ఆదా



సీఐఎఫ్‌టీ రూపొందించి వి-ఫామ్ ఓటర్ బోర్డు

సాక్షి, విశాఖపట్నం: ట్రాలింగ్ అనేది అత్యంత శక్తిని వినియోగించి చేపలు పట్టే పద్ధతుల్లో ఒకటి. చేపల వేట విజయవంతంగా జరగాలంటే అంత మేర బోటు ఇంజిన్ పనిచేయాలి. చేపల వేటకు వెళ్లే సమయంలో బోటు కింద ట్రాల్ దగ్గర వల నోరు తెరిచినట్లుగా ఉండేందుకు ఓటర్ బోర్డులను ఉపయోగిస్తారు. వీటిని వినియోగించడం వల్ల ట్రాలింగ్ సమయంలో హైడ్రోడైనమిక్ డ్రాగ్ ఏర్పడి ఇంజిన్‌పై భారం పడుతోంది. బోటు కదులుతున్న దిశకు వ్యతిరేకంగా ఫోర్స్‌ని ఏర్పరచడం.. దీని వల్ల ఇంజిన్‌పై ఎక్కువ భారం పడి .. ఇంధన వ్యయం పెరుగుతోంది. డ్రాగ్‌తో చేపలు దండిగా లభించినా.. ఖర్చుతో పోలిస్తే మిగిలింది అంతంత మాత్రమే. దీంతో భారీగా జలపుష్పాలు దొరికినా మత్స్యకారులకు మాత్రం ఆర్థిక ఇబ్బందులు తప్పడం లేదు. దశాబ్దాలుగా ఇదే పరిస్థితితో జీవనం సాగిస్తున్నారు.

యురోపియన్ మోడల్‌లో..

మన దేశంలో సాధారణంగా ఉపయోగించే ఓటర్‌బోర్డ్‌లు దీర్ఘచతురస్రాకారంలో ఉంటాయి. వీటి మధ్యలో ఎలాంటి ఖాళీలు లేకపోవడంతో బోటు ప్రయాణంపై ఒత్తిడి పెరుగుతోంది. ఈ బోర్డుల స్థానంలో సీఐఎఫ్‌టీ అధునాతన పద్ధతిలో వి-ఫామ్ కొత్త ఓటర్ బోర్డును తయారు చేసింది. ఈ బోర్డులు స్లాట్‌లతో రూపొందించారు. బోర్డులో మధ్యలో ఉన్న ఖాళీల కారణంగా.. ఇంజిన్‌పై ఒత్తిడి దాదాపు చాలా వరకూ తగ్గుతుంది. మృదువైన నీటి ప్రవాహం/కదలికను అనుమతిస్తాయి. ఇవి సాధారణ ఓటర్ బోర్డులతో పోల్చినప్పుడు నిరోధకతను తగ్గిస్తాయి. తక్కువ నిరోధకత, డ్రాగ్‌ను తగ్గిస్తుంది అందువల్ల ఇంధన వినియోగం తగ్గుతుంది. యూరోపియన్ ట్రాల్ ఫిషరీస్‌లో ఉపయోగిస్తున్న ఈ సాంకేతికతను ఐసీఏఆర్-సీఐఎఫ్‌టీ భారతీయ మత్స్యకారుల కోసం సరికొత్తగా అందుబాటులోకి తీసుకొచ్చింది.



మత్స్యకారులతో ఓటర్ బోర్డు సీట్రయల్స్ నిర్వహిస్తున్న సీఐఎఫ్‌టీ శాస్త్రవేత్త

అద్భుత ఆవిష్కరణగా అభినందనలు

సీఐఎఫ్‌టీ శాస్త్రవేత్తలు చెన్నై, విశాఖ తదితర ప్రాంతాల్లో వరుస ఫీల్డ్ ట్రయల్స్‌ని నిర్వహించారు. ప్రస్తుతం వినియోగిస్తున్న ఓటర్ బోర్డులతో పోల్చితే.. అదే పరిమాణం, బరువు కలిగిన వి-ఫామ్ ఓటర్ బోర్డులు మత్స్యకారులకు ఎంతో ఉపయోగమని నిర్ధారించారు. పాత బోర్డులతో కూడిన బోటు, వి-ఫామ్ ఓటర్ బోర్డును ఏర్పాటు చేసిన బోటుతో వేటకు వెళ్లారు. రెండింటినీ పరిశీలిస్తే.. సీఐఎఫ్‌టీ రూపొందించిన కొత్త బోర్డుతో గంటకు సుమారు 3 లీటర్ల వరకూ ఇంధనాన్ని ఆదా చేయవచ్చని గుర్తించారు. దాదాపు పదుల సంఖ్యలో ట్రయల్స్ నిర్వహించాక అద్భుత ఆవిష్కరణగా మత్స్యకారులు సైతం అభినందనలు తెలిపారు. ఈ ఫలితాల ఆధారంగా రోజుకు 7-8 గంటలు పనిచేసే ఒక సాధారణ సింగిల్ డే ఫిషింగ్ ట్రాలర్‌లో వేటకు వెళ్తే దాదాపు 17 నుంచి 24 లీటర్ల వరకు ఇంధన ఆదా ఉంటుందని గుర్తించారు. అంటే సుమారు రూ.1,800-2,000 ఆదా అవుతుంది. సగటున 20 రోజుల ప్రయాణంతో వేటకు వెళ్తే మొత్తం ఇంధన ఆదా సుమారు 480 లీటర్లు వరకూ ఉంటుంది. దీని ద్వారా ఒక వేటలో దాదాపు రూ.40 వేలకు పైగా ఆదా చేసుకునే అవకాశం కలుగుతుంది.

సముద్రంలో కర్బన ఉద్గారాలూ నియంత్రించగలం



భారతదేశంలో దాదాపు 30,773 ట్రాలర్లు పనిచేస్తున్నాయి. 50 శాతం ట్రాలర్లు సీఐఎఫ్‌టీ వి-ఫామ్ డబుల్ స్లాటెడ్ ఓటర్ బోర్డులను ఏర్పాటు చేస్తే సంవత్సరానికి 7 మిలియన్ లీటర్ల కంటే ఎక్కువ ఇంధనాన్ని ఆదా చేయవచ్చు. అదే విధంగా సుమారు 19 మిలియన్ కిలోల కార్బన్ డయాక్సైడ్ ఉద్గారాలను తగ్గించవచ్చు. ఈ సాంకేతికత పెరుగుతున్న ఇంధన ధరల భారాన్ని తగ్గించడంతో పాటు ట్రాల్ రంగం ఆర్థిక పనితీరును మెరుగుపరచడానికి సహాయపడుతుంది. పీఎంఎస్ఎస్‌వై పథకంలో భాగంగా నిధులు సమకూర్చిన ప్రాజెక్టులో సీఐఎఫ్‌టీ దాదాపు అన్ని సముద్ర రాష్ట్రాలకు వి-ఫామ్ ఓటర్ బోర్డులను అందిస్తోంది.

– **యు.శ్రీధర్**, సీఐఎఫ్‌టీ వైజాగ్ హెడ్ ప్రిన్సిపల్ సైంటిస్ట్

బాల కార్మిక రహిత జిల్లాగా మార్చడమే లక్ష్యం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

సీతంపేట: బాల కార్మిక రహిత జిల్లాగా మార్చడమే లక్ష్యంగా అధికారులు పనిచేయాలని కలెక్టర్ డాక్టర్ హరేందిర ప్రసాద్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం బాలకార్మిక నిర్మూలన చట్టం 12వ టాస్క్‌ఫోర్స్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో బాల కార్మికులను గుర్తించి వాళ్లని బడిలో చేర్పించేందుకు కృషి చేయాలన్నారు. బాల కార్మిక వ్యవస్థను ప్రోత్సహిస్తున్న వారిపై కేసులు నమోదు చేసి చట్టపరంగా చర్యలు చేపట్టాలన్నారు. కార్మికశాఖ డిప్యూటీ లేబర్ కమిషనర్ ఎం.సునీత మాట్లాడుతూ జిల్లాలో 10 ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించి 170 మంది పిల్లలను కార్మిక స్థితినుంచి రక్షించినట్టు తెలిపారు. 10 కేసుల్లో చర్యలు తీసుకున్నట్టు పేర్కొన్నారు. 9 కేసుల్లో రూ.20 వేలు చొప్పున బాల కౌమార పునరావాస నిధికి సేకరించామన్నారు. జనవరి 10 నుంచి మార్చి 31 వరకు త్రైమాసిక ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. పోలీసు, కార్మిక, రెవెన్యూ, విద్య, ఆరోగ్య, శాఖ అధికారులతో పాటు ఎన్జీవో ప్రతినిధులు, జిల్లా బాల పరిరక్షణ యూనిట్ సభ్యులతో ప్రత్యేక రక్షణ బృందం ఏర్పాటు చేశామన్నారు. అనంతరం కార్మికశాఖ రూపొందించిన పోస్టర్లు ఆవిష్కరించారు.

చిన్నారులపై లైంగిక దాడికి ప్రయత్నిస్తే కఠిన శిక్షలు

విశాఖ లీగల్ : చిన్నారులపై లైంగిక దాడులు, వేధింపులకు గురిచేస్తే కఠిన శిక్షలు తప్పవని నగరంలోని మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి ఎం.వెంకటరమణ స్పష్టం చేశారు. సోమవారం సాయంత్రం జిల్లా కోర్టు ప్రాంగణంలోని న్యాయ సేవా సదన్‌లో పోలీసు అధికారులు, సమాంతర సేవా న్యాయ సహాయకులు, మహిళా సంఘాల ప్రతినిధులు, న్యాయ వాదులకు పోక్సో చట్టంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోక్సో చట్టం పాఠశాల స్థాయిలో సమర్థవంతంగా అమలు జరగాలన్నారు. విద్యార్థులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై పూర్తి అవగాహన కల్పించాలని సూచించారు. పోక్సో ప్రత్యేక న్యాయస్థానం న్యాయమూర్తి జి.ఆనంది మాట్లాడుతూ బాలలపై లైంగిక వేధింపులకు గురిచేసిన యువత శిక్షల నుంచి తప్పించుకోవడం సులభం కాదన్నారు. న్యాయ సేవా ప్రాధికార సంస్థ కార్యదర్శి ఎం.వెంకట శేషమ్మ మాట్లాడుతూ మార్చి నెలంతా ప్రతి పాఠశాలలో పోక్సో చట్టంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో న్యాయమూర్తి వరలక్ష్మి, నగర నేరవిభాగం ఉప కమిషనర్ లతా మాధురి, బాలల సంక్షేమ కమిషన్ సభ్యులు, మధ్యవర్తిత్వ శిక్షణ పొందిన న్యాయవాదులు పాల్గొన్నారు.

వచ్చే నెల 28 నుంచి ఏయూ దూరవిద్య పరీక్షలు

విశాఖ విద్య: ఆంధ్ర యూనివర్సిటీ దూర విద్యా విభాగం ద్వారా యూజీ, పీజీ కోర్సుల్లో ప్రవేశాలు పొందిన అభ్యర్థులకు పరీక్ష షెడ్యూల్ జారీచేసినట్లు సీడీఈ డైరెక్టర్ ఆచార్య విజయ మోహన్ ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి 13 వరకు ఫీజు చెల్లించవచ్చన్నారు. మార్చి 28 నుంచి పరీక్షలు నిర్వహించనున్నట్లుగా తెలిపారు. పూర్తి వివరాలకు స్కూల్ ఆఫ్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ వెబ్‌సైట్‌లో చూడాలన్నారు.

పంచగ్రామాల్లో ఇళ్ల నిర్మాణాల పునఃపరిశీలన

సింహాచలం దేవస్థానం అధికారులతో మూడు బృందాల ఏర్పాటు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థాన పరిధి పంచగ్రామాల్లో ఉన్న ఇళ్లను దేవస్థానం అధికారులు పునఃపరిశీలన చేయనున్నారు. దేవస్థానం భూసమస్య పరిష్కారంలో భాగంగా తొలుత ఇళ్ల నిర్మాణాల సమస్యని తీర్చేందుకు ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. ఈ మేరకు నిర్మాణాలను పరిశీలించి నివేదిక ఇవ్వాల్సిందిగా రాష్ట్ర దేవదాయశాఖ కమిషనర్ కార్యాలయం ఇటీవల సింహాచలం దేవస్థానం అధికారులను ఆదేశించింది. 2008లోనే పంచగ్రామాలైన అడవివరం, వేపగుంట, చీమలాపల్లి, వెంకటాపురం, పురుషోత్తపురంలో ఎన్ని ఇళ్ల నిర్మాణాలు జరిగాయో దేవస్థానం సర్వే చేసింది. ఆ సర్వే రిపోర్టులో మొత్తం 12,149 నిర్మాణాలున్నట్లు లెక్క తేల్చింది. హైకోర్టుకు కూడా ఆ నివేదికను సమర్పించింది. అప్పటి నుంచి ఆ నిర్మాణాలను క్రమబద్ధీకరించేందుకు, ప్రత్యామ్నాయంగా దేవస్థానానికి ప్రభుత్వ స్థలాలు అందించేందుకు ప్రయత్నిస్తున్నారు. ఆ జాబితాలోని నిర్మాణాలను మరొకసారి పరిశీలించి నివేదిక అందించాలని దేవస్థానం అధికారులను దేవదాయ శాఖ ఆదేశించింది. ఈ పరిశీలన కోసం దేవస్థానం అధికారులతో మూడు బృందాలను ఏర్పాటు చేసినట్లు దేవస్థానం ఈవో వి.త్రినాథరావు తెలిపారు. అప్పటి నివేదిక ఆధారంగా ఆయా నిర్మాణాలు ఎలా ఉన్నాయో పరిశీలించి, తుది నివేదికను కమిషనర్‌కి సమర్పిస్తామన్నారు.

భూగర్భ డ్రైనేజీ కాంట్రాక్ట్ రద్దు

అల్లిపురం: గ్రేటర్ విశాఖ స్మార్ట్ సిటీ కార్పొరేషన్ లిమిటెడ్ (జీవీఎస్‌సీఎల్) గాజువాక, మల్కాపురం ప్రాంతంలో చేపట్టిన భూగర్భ మురుగునీటి వ్యవస్థ టెండర్లు రద్దు చేస్తూ మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్‌కుమార్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. గాజువాక, మల్కాపురం ప్రాంతంలో రూ.448 కోట్ల వ్యయంతో 2017-18లో టెండర్లు దక్కించుకున్న టాటా ప్రాజెక్ట్సు సంస్థ పనులు నత్తనడకన సాగుతున్నాయి. పనులు చేపట్టి ఏడేళ్లు కావడంతో అప్పట్లో ఇచ్చిన ధరలతో ప్రాజెక్టు చేపట్టలేమని కాంట్రాక్ట్ సంస్థ ప్రభుత్వానికి తెలియజేసింది. దీంతో టెండర్లు రద్దు చేసి తిరిగి, కొత్తగా టెండర్లు పిలవాలని ఉత్తర్వులో పేర్కొంది. ఇప్పటి వరకు రూ.100 కోట్ల మేర పనులు పూర్తి చేసింది. మిగిలిన పనులకు కొత్తగా ప్రతిపాదనలు తయారు చేసి, టెండర్లు ఆహ్వానించనున్నట్లు ప్రాజెక్ట్సు పర్యవేక్షక ఇంజినీరు కేవీఎస్ రవి తెలిపారు.

ఇండస్ట్రియల్ ఎగ్జిబిషన్లతో ఎంఎస్ఎంఈలకు ఆసరా



మాట్లాడుతున్న హెచ్‌పీసీఎల్(మెటీరియల్స్) సీజీఎం తిరుమురుగన్

అక్కిరెడ్డిపాలెం: వెండర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంలో భాగంగా బయ్యర్, సెల్లర్ మీట్ కమ్ ఇండస్ట్రియల్ ఎగ్జిబిషన్లతో ఎంఎస్ఎంఈలకు మార్కెటింగ్ మద్దతు మరింతగా అందించవచ్చని వివిధ సంస్థల ప్రతినిధులు తెలిపారు. ఆటోనగర్‌లోని ఎంఎస్ఎంఈ- డీఎఫ్‌వో విశాఖ క్యాంపస్‌లో వాసీవా సహకారంతో ఇండస్ట్రియల్ ఎగ్జిబిషన్‌ను సోమవారం నిర్వహించారు. పబ్లిక్ ప్రొక్యూర్‌మెంట్ పాలసీ(పీపీపీ) 2012 ప్రకారం కేంద్ర ప్రభుత్వ మంత్రిత్వ విభాగాలు, సెంట్రల్ పబ్లిక్ సెక్టార్ ఎంటర్ ప్రైజెస్ (సీపీఎస్ఈ)లు తమ వార్షిక కొనుగోళ్లలో కనీసం 25 శాతం వస్తువులు, సేవలను ఎంఎస్ఎంఈల నుంచి కొనుగోలు చేయాలన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న హెచ్‌పీసీఎల్ (మెటీరియల్స్) సీజీఎం కె.తిరుమురుగన్, బీఎస్ఎన్ఎల్ డీజీఎం సత్యప్రసాద్‌లు పాల్గొని పీపీపీ-2012 గురించి విపులంగా వివరించారు. వాసీవా సంయుక్త కార్యదర్శి ఈడుపుగంటి అనార్‌బాబు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ ఔత్సాహిక మహిళా పారిశ్రామికవేత్తలకు మెరుగైన అవకాశాలను కల్పించి, వారిని ప్రోత్సహించాలన్నారు. ఎగ్జిబిషన్లో 6 సీపీఎస్ఈలు, 22 ఎంఎస్ఎంఈలు స్టాళ్లు ఏర్పాటు చేశాయి. ఎంఎస్ఎంఈ ఏడీ, ప్రోగ్రాం కో ఆర్డినేటర్ అప్పికొండ శ్రీను ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంఎస్ఎంఈ జాయింట్ డైరెక్టర్ ఎస్.విజయ్‌కుమార్, ఎం.సుధీర్ అడ్వకేట్, హెచ్‌పీసీఎల్ జనరల్ మేనేజర్ ఎం.సుధాకర్, డీసీఎం, ఆర్ఐఎన్ఎల్ స్మిత రేవతి, యూకో బ్యాంక్ చీఫ్ జనరల్ మేనేజర్ డి.వి.రావు, పోవా అధ్యక్షుడు సత్యన్నారాయణ, వాసీవా కార్యదర్శి వి.రామ్ ప్రసాద్, ఎంఎస్ఎంఈ ఏడీలు డాక్టర్ కెవిఎస్ రెడ్డి, చంద్రమౌళి, ప్రభాకర్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

రుచీ లేదు.. శుచీ లేదు..!

- అధ్వానంగా మధ్యాహ్న భోజనం
- బడిభోజనం తినేందుకు ఇష్టపడని విద్యార్థులు
- ఇళ్ల నుంచి బాక్సులు తెచ్చుకుంటున్న వైనం
- పాఠశాలలపై జిల్లా యంత్రాంగం పర్యవేక్షణ కరువు



మాధవధార హైస్కూల్లో ఇంటి నుంచి తెచ్చుకున్న భోజనాన్ని తింటున్న విద్యార్థినులు



కూరలేదని చూపిస్తున్న విద్యార్థులు

విశాఖ విద్య : బడి భోజనం నాణ్యత లోపించింది. ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం పథకం నిర్వహణ అధ్వానంగా తయారైంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం అని పేరైతే మార్చేశారని కానీ క్షేత్రస్థాయిలో దీని అమలుపై ఏమాత్రం శ్రద్ధ చూపడం లేదు. జిల్లా యంత్రాంగం పర్యవేక్షణ సరిగా లేకపోవటంతో బడి పిల్లలకు అర్ధాకలి తప్పడం లేదు. కోడిగుడ్లు కుళ్లిన వాసన వస్తుండటంతో వాటిని తీసుకునేందుకు విద్యార్థులు ఇష్టపడటం లేదు. ముక్కిన బియ్యం సరఫరా చేస్తుండటంతో.. అన్నం రుచీ శుచీ లేక విద్యార్థులు తినడం మానేస్తున్నారు. చాలా మంది విద్యార్థులు ఇళ్ల నుంచే బాక్సులు తెచ్చుకుంటున్నారు. మధ్యాహ్న భోజన పథకం అమలయ్యే జిల్లాలోని ఏ స్కూల్‌కు వెళ్లి చూసినా ఇటువంటి పరిస్థితే కనిపిస్తోంది.

అంతా అంకెల గారడీ

జిల్లాలోని ప్రభుత్వ యాజమాన్య పరిధిలోని 581 పాఠశాలల్లో 1 నుంచి 10వ తరగతి వరకు చదువుకునే విద్యార్థుల కోసం మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తున్నారు. 2024-25 విద్యా సంవత్సరం ఎండీఎం యాప్‌లో నమోదైన సోమవారం నాటి గణాంకాల మేరకు 71,858 మంది విద్యార్థులకు బడిలో మధ్యాహ్న భోజనం అందించేలా బడ్జెట్ కేటాయింపులు చేస్తున్నారు. వీటిలో 338 స్కూళ్లలోని సుమారు 47 వేల మంది విద్యార్థులకు అక్షయ పాత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో భోజనం సరఫరా చేస్తున్నారు. సోమవారం జిల్లాలో 59,490 మంది విద్యార్థులు బడికి హాజరు కాగా, వీరిలో 57,950 విద్యార్థులు భోజనం తీసుకున్నట్లు ఎండీఎం యాప్‌లో నమోదైంది. ఈ లెక్కన బడికి హాజరైన వారిలో 97.4 శాతం మంది విద్యార్థులు భోజనం తింటున్నారనేది అధికారులు లెక్కలు చెబుతున్నాయి. కానీ సగం మందికి పైగా విద్యార్థులు ఇంటి దగ్గర నుంచి బాక్స్‌లు తెచ్చుకున్నట్లు తెలుస్తోంది.

పేరుకే మెనూ మార్పు



విద్యార్థులు తీసుకోక మిగిలిన గుడ్లు, బిర్యానీ

ఉత్తరాంధ్ర జిల్లాల్లోని పరిస్థితి దృష్ట్యా ఇక్కడి విద్యార్థుల ఆహారపు అలవాట్లు మేరకు మెనూలో మార్పులు చేశామని ప్రభుత్వం గొప్పలు చెబుతోంది. నూతన మెనూ ట్రైల్ రన్ తక్షణమే అమల్లోకి వచ్చేలా ఈ నెల 19న ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీని ప్రకారం సోమవారం వైట్ రైస్, ఆకు కూరపప్పు, ఉడికించిన గుడ్లు, చిక్కీ పెట్టాలి. కానీ అన్ని స్కూళ్లలో గత మెనూ మేరకు వెజిటబుల్ బిర్యానీ పెట్టారు. పేరుకే మెనూ మార్పు తప్ప క్షేత్రస్థాయిలో దీని అమలుపై ప్రభుత్వం ఏమాత్రం దృష్టి పెట్టడం లేదని దీని ద్వారా తేటతెల్లమవుతోంది.

ఇదేదో తేడాగా ఉంది



మిగిలిపోయిన బిర్యానీ చూపిస్తున్న కార్మికురాలు

మాధవధార హైస్కూల్‌ను సోమవారం మధ్యాహ్న భోజనం సమయంలో 'సాక్షి' పరిశీలన చేయడం జరిగింది. ఇక్కడ 610 మంది విద్యార్థులు ఎన్‌రోల్‌మెంట్ ఉండగా 609 మంది బడికి హాజరైనట్లు నమోదు చేశారు. వీరంతా మధ్యాహ్న భోజనం తిన్నట్లు పాఠశాల నిర్వాహకులు తెలిపారు. కానీ ఇక్కడ చాలా మంది విద్యార్థులు ఇంటి నుంచి తెచ్చుకున్న బాక్సుల్లో భోజనం తింటూ కనిపించారు. అలాగే పలువురు విద్యార్థులు మధ్యాహ్నం భోజనం ఇంకా తినాల్సి ఉండగా ఈలోగానే కూర అయిపోయింది. దీంతో కేవలం బిర్యానీ మాత్రం వడ్డించారు. గుడ్లు కుళ్లిన వాసన వస్తుండటంతో చాలా మంది వీటిని తీసుకోలేదు. ఒక్క మాధవధార స్కూల్లోనే కాదు, జిల్లాలోని ఏ స్కూల్లో చూసినా ఇలాంటి పరిస్థితులే ఉన్నాయి. విద్యాశాఖాధికారుల పర్యవేక్షణ లేదనడానికి ఇదే నిదర్శనంగా నిలుస్తోంది. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకపోతే ఎలా?



మాట్లాడుతున్న జీవీఎంసీ కాంట్రాక్టర్ల అసోసియేషన్ చైర్మన్ రొంగలి జగన్నాథం, అసోసియేషన్ ప్రతినిధులు

డాబాగార్డెన్స్: జీవీఎంసీ కాంట్రాక్టర్ల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని, సాక్షాత్తు కమిషనర్ అప్రూవల్ చేసిన బిల్లులే అధికారులు పెండింగ్‌లో పెడతున్నారని, ఓ వైపు డబ్బులేవంటూనే..మరో వైపు టెండర్లు పిలవడంలో ఆంతర్యమేంటని ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ కాంట్రాక్టర్ల వ్యవస్థాపక అధ్యక్షుడు, జీవీఎంసీ కాంట్రాక్టర్ల అసోసియేషన్ చైర్మన్ రొంగలి జగన్నాథం ప్రశ్నించారు. అప్పులు చేసి పనులు పూర్తి చేసిన చిన్న కాంట్రాక్టర్లు రోడ్డున పడ్డారని..అందుకు నిదర్శనమే ఓ కాంట్రాక్టర్ తన కుటుంబంతో జీవీఎంసీకి వచ్చి మొర పెట్టుకున్నాడని తెలిపారు. వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం మీడియా సమావేశంలో రొంగలి మాట్లాడుతూ చేసిన పనులకు బిల్లులు చెల్లించకపోవడంతో కొందరు రోడ్డున పడ్డారని..మరి కొంతమంది ఆత్మహత్యలకు పాల్పడే దుస్థితికి జీవీఎంసీ అధికారులు తీసుకొచ్చారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు జీవీఎంసీ కాంట్రాక్టర్లకు రూ.400 కోట్లకు పైబడి బకాయిలు చెల్లించాల్సి ఉందని, ఫలితంగా కాంట్రాక్టర్ల కుటుంబాలు ఎంతో ఆవేదనకు గురవుతున్నారని తెలిపారు. అస్తవ్యస్తంగా ఉన్న జీవీఎంసీని మేయర్ గొలగాని హరి వెంకటకుమారి గాడిన పెట్టాలని కోరారు. జీవీఎంసీలో ఇంజినీరింగ్ వ్యవస్థ ప్రక్షాళన చేయాల్సి ఉందన్నారు. ఇంజినీర్లు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు.. కాంట్రాక్టర్ల అవతారమెత్తుతున్నారని ఆరోపించారు. బకాయిలు తక్షణమే చెల్లించాలని, లేకపోతే ఉద్యమ బాట పట్టాల్సి వస్తుందని రొంగలి హెచ్చరించారు. సమావేశంలో అసోసియేషన్ ప్రతినిధులు పీఎస్ ప్రసాద్, సీహెచ్ ప్రసాదరావు, సత్యనారాయణ, అంగా రమేష్, ఎంవీ సత్యనారాయణ పలువురు కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

కారు ఢీకొని ఐటీ ఉద్యోగికి తీవ్ర గాయాలు

కొమ్మాది: భీమిలి బీచ్‌రోడ్డులో ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొన్న సంఘటనలో ఐటీ ఉద్యోగి తీవ్రంగా గాయపడింది. పీఎంపాలెం సీఐ జి.బాలకృష్ణ తెలిపిన వివరాలు.. పెదగంట్యాడలోని వినాయకనగర్‌కు చెందిన జి.జ్యోతిర్మయి బెంగళూర్‌లోని ఇన్ఫోసిస్‌లో పదేళ్లుగా ఉద్యోగం చేస్తున్నారు. వ్యక్తిగత కారణాలతో విశాఖలో కొద్దిరోజులు ఉండాల్సి రావడంతో రుషికొండ ఐటీ హిల్స్‌లో అదే సంస్థలో విధులు నిర్వహిస్తున్నారు. సోమవారం విధులకు హాజరై మధ్యాహ్నం తిరిగి నగరానికి వచ్చేందుకు ర్యాపిడో (ద్విచక్రవాహన) బుక్ చేసుకున్నారు. బీచ్‌రోడ్డులో ఐటీ కూడలి వద్ద సాగర్‌నగర్ నుంచి తిమ్మాపురంవైపు ఓ కారు అతి వేగంగా వచ్చి వీరి ద్విచక్రవాహనాన్ని బలంగా ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో రోడ్డుపై వీరిరువురు చెల్లా చెదురుగా పడిపోయారు. జ్యోతిర్మయికి తీవ్ర గాయాలై అపస్మారక స్థితికి చేరుకుంది. ద్విచక్ర వాహనదారుడు తీవ్ర గాయాలతో చికిత్స పొందుతున్నాడు. ప్రమాదం జరిగిన సమీపంలో పీఎంపాలెం ఎస్‌ఐ కె. భాస్కర్ అక్కడే ఉండటంతో గాయపడిన వీరిని ఆస్పత్రికి తరలించారు. కారు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు.

ఆ వేదనే.. ఆలంబనై..

గుండెకోతను సేవగా మార్చిన మానవతావాది శ్రీరామ్

పేదల జీవితాల్లో వెలుగులు నింపుతున్న స్నిగ్ధ శ్రీదేవి ఫౌండేషన్

ఒక ప్రమాదం ఆయన జీవితంలో అంతులేని విషాదాన్ని నింపింది. రోడ్డు ప్రమాదంలో కళ్లముందే భార్యను.. కూతురును కోల్పోయిన శ్రీరామ్.. ఆ వేదనను ఎందరి జీవితాలకో ఆలంబనగా మార్చారు. కన్నీటి సుడులు పట్టి కుదిపేస్తున్నా.. ఈ లోకంలో లేని భార్యా కుమార్తెల పేర్లను చిరస్థాయిలా నిలపాలని నిర్ణయించారు. ఆ సత్సంకల్పం నేడు ఎందరో పేదల జీవితాల్లో వెలుగులు నింపుతోంది. వారందరి ఉన్నతిలో స్నిగ్ధ.. శ్రీదేవి చిరంజీవులుగా వెలుగొందుతున్నారు.



సంచార జాతుల వారికి దుప్పట్లు, దుస్తులు అందిస్తున్న శ్రీరామ్



ఉచిత టైలరింగ్ శిక్షణలో పాల్గొన్న మహిళలు

భీమునిపట్నం : కలిగొట్ల స్నిగ్ధ శ్రీదేవి ఫౌండేషన్ చైర్మన్ కలిగొట్ల శ్రీరామ్‌కు న్యాయవాదిగా మంచి పేరు ఉంది. ఆయనకు భార్య శ్రీదేవి, 12 ఏళ్ల కుమార్తె స్నిగ్ధ ఉండేవారు. భార్యాభర్తలకు ఒక్కగానొక్క కుమార్తె అంటే పంచప్రాణాలు. ఎంతో ఆనందంగా సాగిపోతున్న వీరి జీవితంలో రోడ్డు ప్రమాదం పెను విషాదాన్ని నింపింది. 2015 అక్టోబర్ 27న శ్రీరామ్ తన భార్య, కుమార్తెతో హైదరాబాద్ నుంచి భీమిలికి కారులో వస్తుండగా కోదాడ సమీపంలో కారు ప్రమాదానికి గురైంది. ఈ దుర్ఘటనలో భార్య, కుమార్తె మరణించారు. తన డ్రైవింగ్‌లో, తన కళ్లముందే వారు చనిపోవడంతో ఆయన తీవ్రంగా కుంగిపోయారు. ఈ ప్రమాదంలో ఆయనకు తీవ్ర గాయాలయ్యాయి. మానసికంగానూ దెబ్బతిన్న ఆయన ఒంటరిగా మిగిలిపోయారు. చాలా రోజుల తర్వాత విషాదం నుంచి తేరుకున్న శ్రీరామ్.. తన భార్య, కుమార్తె పేరు మీద సేవా కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించుకున్నారు. అలా 2017లో కలిగొట్ల స్నిగ్ధ శ్రీదేవి ఫౌండేషన్ పురుడుపోసుకుంది. పేదలకు స్వయం ఉపాధి శిక్షణలు, విద్యార్థులకు విద్యా సహాయం, ఉచిత వైద్య శిబిరాలు, అనాథ వృద్ధాశ్రమాలకు నిత్యావసర వస్తువుల పంపిణీ వంటి ఎన్నో కార్యక్రమాలతో ఈ ఫౌండేషన్ కరుణ, దాతృత్వం, మానవత్వానికి గొప్ప ఉదాహరణగా నిలుస్తోంది.

ఇవీ సేవలు..

- 2017 నుంచి కలిగొట్ల స్నిగ్ధ శ్రీదేవి ఫౌండేషన్ నిర్విరామంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోంది. భీమిలి పరిధిలో పేదలు, ఆశ్రమాల్లో అనాథలకు, వృద్ధులకు నిత్యావసర సరకులు, దుస్తులు అందజేస్తోంది. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థులకు నోటు పుస్తకాలు, బ్యాగులు, కంచాలు అందిస్తోంది. పలు గ్రామాల్లో యువతకు క్రికెట్ కిట్లు, ఇతర క్రీడా సామగ్రి అందజేస్తోంది. ఇందుకోసం ఏడాదికి రూ. రూ.50 లక్షలకు పైనే వెచ్చిస్తోంది. అలాగే పలువురు వైద్యానికి, వివాహాలకు ఫౌండేషన్ చైర్మన్ శ్రీరామ్ ఆర్థిక సాయం అందిస్తున్నారు. ఇందుకోసం మరో రూ.10 లక్షలు కేటాయించారు.
- తొమ్మిదేళ్లుగా ప్రతి నెలా మూడవ ఆదివారం ఉచిత హోమియో వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నారు. ఇందుకోసం ప్రత్యేకించి ఇద్దరు వైద్యులు విశాఖ నుంచి వస్తున్నారు. వంద మందికి పైనే రోగులు వస్తుండగా.. వారికి ఉచితంగా నెలకు సరిపడా మందులు అందిస్తున్నారు.



ఉచిత హోమియో వైద్య శిబిరం

- పేద మహిళలు స్వయం ఉపాధి పొందడానికి టైలరింగ్‌లో శిక్షణ అందిస్తున్నారు. ఏడాదిలో ఎనిమిది నెలలపాటు శిక్షణ ఉంటుంది. ఇప్పటివరకు ఎనిమిది బ్యాచ్‌ల్లో 700 మందికి పైగా శిక్షణ ఇచ్చారు. వీరిలో నిరుపేద మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్లు అందిస్తున్నారు. జాబ్ వర్క్స్‌కు సంబంధించి ఆరు నెలల పాటు కంప్యూటర్ కోర్సును అందిస్తున్నారు. ఇప్పటి వరకు 500 మంది వరకు కంప్యూటర్ శిక్షణ పొందారు.
- తీవ్ర మంచినీటి ఎద్దడితో ఉన్న మామిడిపాలెంలో ఎస్సీల కోసం రూ. ఐదు లక్షలతో ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేశారు.
- చలికాలంలో భీమిలితోపాటు, విశాఖలోని పలు ప్రాంతాల్లో ఫుట్‌పాత్‌లపై ఉంటున్న వారికి, సంచార జాతుల వారికి రగ్గులు, దుస్తులు అందజేస్తున్నారు. అరకు ప్రాంతంలోని అనేక గ్రామాల్లో దుస్తులు, దుప్పట్లు అందజేయడంతో పాటు ఆర్థిక సాయం చేస్తున్నారు.
- 2017లో భీమిలి సమీపంలోని కీతిన్‌పేట వద్ద రూ.3 కోట్లతో తన సొంత స్థలంలో ఐశ్వర్య వేంకటేశ్వర స్వామి ఆలయం నిర్మించారు. ఇక్కడ ప్రతీ శనివారం భక్తులకు అన్న ప్రసాదం అందజేస్తున్నారు.
- ఇలా శ్రీరామ్ ఎన్నో మార్గాల ద్వారా సేవలందించడమే కాకుండా.. సాయం కోసం ఎవరు వచ్చినా కాదనుకుంటా అండగా నిలుస్తున్నారు. ఈ ఫౌండేషన్ అందిస్తున్న సేవలకు నీతి ఆయోగ్ దర్పణ్ గుర్తింపు లభించింది.

ఆనందంగా జీవిస్తున్నా..



నాకు ఆర్థికంగా ఎన్నో ఇబ్బందులు ఉండేవి. నాకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో ఈ ఫౌండేషన్ ద్వారా టైలరింగ్‌లో ఉచిత శిక్షణ తీసుకున్నాను. నా పరిస్థితి చూసి చైర్మన్ శ్రీరామ్ ఉచితంగా కట్టుమిషన్ అందించారు. ప్రస్తుతం నెలకు రూ.15 వేలకు పైనే సంపాదిస్తూ.. ఆనందంగా జీవిస్తున్నాను.

– లక్ష్మి, బ్యాంక్ కాలనీ, భీమిలి

ఆరోగ్యం మెరుగుపడింది.



ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతి నెలా నిర్వహిస్తున్న ఉచిత హోమియో వైద్య శిబిరం వల్ల నాకు ఎంతో మేలు జరుగుతోంది. నాకు ఎప్పటి నుంచో మోకాళ్ల నొప్పులతోపాటు ఇతర సమస్యలు ఉన్నాయి. గతంలో వాడిన మందుల వల్ల ఫలితం రాలేదు. కానీ ఇక్కడ శిబిరం పెట్టిన తర్వాత వైద్యులు బాగా చూడడంతోపాటు ఎంతో మంచి మందులను అందిస్తున్నారు. దీని వల్ల చాలా వరకు అనారోగ్య సమస్యలు తీరాయి.

– లక్ష్మీనర్సమ్మ, భీమిలి

జీవితాన్ని నిలబెట్టారు



నిరుద్యోగిగా ఉన్న నేను స్నిగ్ధ శ్రీదేవి ఫౌండేషన్ అందించిన కంప్యూటర్ శిక్షణలో పాల్గొన్నాను. పలు కోర్సుల్లో శిక్షణ తీసుకున్నాను. ప్రస్తుతం ఓ ప్రైవేట్ కంపెనీలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తూ.. కుటుంబానికి అండగా ఉంటున్నాను.

– కె.యామిని, భీమిలి

సేవల్లో సంతృప్తి



నా భార్య శ్రీదేవి, కూతురు స్నిగ్ధ పేరు మీద ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తుండడం ఆత్మ సంతృప్తినిస్తోంది. పేద పిల్లలకు కార్పొరేట్ తరహాలో మంచి వసతులతో కూడిన పాఠశాల నిర్మించాలన్నదే నా లక్ష్యం. అందుకు తగిన విధంగా ప్రణాళికలను సిద్ధం చేసుకుంటున్నాను. త్వరలోనే ఇది కార్యరూపం దాల్చే అవకాశం ఉంది.

–కలిగొట్ల శ్రీరామ్, ఫౌండేషన్ చైర్మన్, భీమిలి

మృతదేహంతో బంధువుల ఆందోళన

- చేయని నేరానికి బాధ్యుడ్ని చేయడంతో ఆనంద్ మృతి
- గోపాలపట్నం పోలీసు స్టేషన్ వద్ద కుటుంసభ్యుల బైఠాయింపు
- న్యాయం చేస్తామని పోలీసుల హామీ



గోపాలపట్నం పోలీస్ స్టేషన్ వద్ద నిరసన తెలుపుతున్న మృతుని కుటుంబ సభ్యులు

గోపాలపట్నం : చేయని నేరానికి తరచూ పోలీసు స్టేషన్‌కు పిలుస్తున్నారని మనస్తాపం చెందిన ఆనంద్ ఆదివారం బలవన్మరణానికి పాల్పడిన విషయం తెలిసిందే. తప్పుడు కేసు పెట్టి మానసిక వేదనకు గురిచేయడం వల్లే తమ కుమారుడు మృతి చెందాడని తల్లిదండ్రులు, వారి బంధువులు సోమవారం గోపాలపట్నం పోలీసు స్టేషన్ వద్ద ఆందోళనకు దిగారు. ఆదివారం ఆనంద్ మృతి చెందగా..సోమవారం కేజీహెచ్‌లో పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. వారు నేరుగా మృతదేహాన్ని గోపాలపట్నం పోలీసు స్టేషన్‌కు తీసుకొచ్చి ఆందోళన నిర్వహించారు. గత ఏడాది జరిగిన సంఘటనకు ఏమాత్రం సంబంధం లేని ఆనంద్‌ను తరుచూ పోలీసు స్టేషన్‌కు పిలిపించి దొంగగా ముద్ర వేడయంతోనే ఆత్మహత్యకు పాల్పడ్డాడని, తమకు న్యాయం చేయాలని బంధువులు డిమాండ్ చేశారు. దీంతో ఆ ప్రాంతంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకున్నాయి. ఈ సందర్భంగా సీఐ గొలగాని అప్పారావు, ఎస్‌ఐ అప్పలనాయుడు బాధితులతో చర్చించారు. విచారణ జరిపి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో ఆందోళన విరమించి మృతదేహాన్ని శ్మశాన వాటికకు తరలించారు. ఆందోళన కారణంగా ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది.

తమిళనాడు ట్రైనీలు జైలు సందర్శన



ట్రైనీలకు సూచనలు ఇస్తున్న జైల్ సూపరింటెండెంట్ మహేష్‌బాబు

ఆరిలోవ: విశాఖ కేంద్ర కారాగారాన్ని తమిళనాడుకు చెందిన ట్రైనీ జైలర్లు, డిప్యూటీ జైలర్లు సోమవారం సందర్శించారు. తమిళనాడు రాష్ట్రం వెల్లూరులో అకాడమి ఆఫ్ ప్రిజన్ అండ్ కరెక్షనల్ అడ్మినిస్ట్రేషన్స్(ఏపీసీఏ)లో 39 మంది ట్రైనీలు 9 నెలల శిక్షణలో భాగంగా అధ్యయన పర్యటనలో ఉన్నారు. దేశంలో పలు జైళ్లను పరిశీలనలో భాగంగా విశాఖ కేంద్ర కారాగారాన్ని సందర్శించారు. వారంతా జైల్ ఆవరణ, ఖైదీలు ఉండే బేరక్‌లు, ఖైదీలకు అందిస్తున్న ఆహారం, కల్పిస్తున్న వసతులు పరిశీలించారు. అనంతరం వారితో జైల్ సూపరింటెండెంట్ ఎం.మహేష్‌బాబు సమావేశమయ్యారు. జైల్ విధివిధానాలు, నిబంధనలు, భద్రత, ప్రోటోకాల్ విధానం, ఎదురయ్యే సవాళ్లు, అత్యవసర సమయాలలో సిబ్బంది ప్రతిస్పందన, ఖైదీలలో తీసుకురావల్సిన మార్పు, రోజువారీ కార్యకలాపాలు తదితర వాటి గురించి ట్రైనీలకు వివరించారు. ఖైదీలకు చేతి వృత్తుల్లో అందిస్తున్న స్కిల్ డెవెలప్‌మెంట్ శిక్షణ, అందుబాటులో ఉన్న పరిశ్రమలను తెలియజేశారు. సమావేశంలో జైల్ డిప్యూటీ సూపరింటెండెంట్లు ఎస్.సాయి ప్రవీణ్, కె.జవహర్‌బాబు, సీహెచ్ సూర్యకుమార్, పలువురు జైలర్లు పాల్గొన్నారు.

ఫిర్యాదుల పరిష్కారమే ప్రథమ కర్తవ్యం



పీజీఆర్‌ఎస్‌పై జరిగిన సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్

సాక్షి, విశాఖపట్నం: ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్‌ఎస్)లో ప్రజలు ఇచ్చే ప్రతి ఫిర్యాదుని పరిష్కరించడమే ప్రథమ కర్తవ్యంగా అధికారులు, ప్రభుత్వ ఉద్యోగులు విధులు నిర్వర్తించాలని కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ సూచించారు. పీజీఆర్‌ఎస్ వినతుల పరిష్కారం, పెండింగ్ దరఖాస్తులు, ఇతర అంశాలపై కలెక్టరేట్ మీటింగ్ హాల్‌లో సోమవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా శాఖల వారీగా ఎన్ని దరఖాస్తులు పెండింగ్ ఉన్నాయి. ఎలాంటి చర్యలు చేపట్టాలి అనే అంశాలపై సమీక్ష చేసిన కలెక్టర్ అధికారులకు పలు సూచనలు జారీ చేశారు. ఈ సందర్భంగా హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ ప్రతి రోజూ ఓ అరగంట పీజీఆర్‌ఎస్ కోసం కేటాయించాలని, తద్వారా పరిష్కారంలో నాణ్యత పెరుగుతుందన్నారు. ఒకసారి వచ్చిన దరఖాస్తు మళ్లీ రాకుండా అధికారులు జాగ్రత్త వహించాలని, ఫిర్యాదుదారు పూర్తి స్థాయిలో సంతృప్తి చెందేలా వ్యవహరించాలని ఆదేశించారు. ఎక్కువగా ఫిర్యాదులు వచ్చే శాఖలు మరింత బాధ్యతగా వ్యవహరించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. స్వర్ణాంధ్ర-2047 విజన్ ప్లాన్‌లో భాగంగా రూపొందించిన జిల్లా అభివృద్ధి ప్రణాళిక-2029పై అధికారులు దృష్టి సారించాలన్నారు. పది ప్రామాణిక సూత్రాలకు అనుగుణంగా జిల్లాలోని అన్ని అంశాలను పరిగణలోకి తీసుకొని ప్రణాళికలను అమలు పరచాలని తెలిపారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, డీఆర్వో బీహెచ్ భవానీ శంకర్, ఏడీసీపీ రాజ్ కమల్, జీవీఎంసీ, ఇతర విభాగాల జిల్లా స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బకాయిలు వసూలు చేయాలి

విశాఖ సిటీ: వీఎంఆర్‌డీఏ నిర్మించిన గృహ సముదాయాలకు సంబంధించి ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న బకాయిలను కొనుగోలుదారుల నుంచి వసూలు చేయాలని మెట్రోపాలిటన్ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్ అధికారులను ఆదేశించారు. సోమవారం వీఎంఆర్‌డీఏ సమావేశ మందిరంలో పరిపాలనా విభాగానికి సంబంధించిన అంశాలపై సమీక్షించారు. గతంలో సంస్థ గొల్లలపాలెం, పెదగంట్యాడ, అనకాపల్లి, బాల్‌చెరువు, సీతమ్మధార, నెహ్రూనగర్, సాగర్‌నగర్, వెంకోజీపాలెం, సింహపురి కాలనీ, కనపాక అయ్యన్నపేట తదితర ప్రాంతాల్లో నిర్మించిన గృహ సముదాయాలకు సంబంధించిన బకాయిలను వెంటనే వసూలు చేయాలని చెప్పారు. అనంతరం రిజిస్ట్రేషన్ కూడా చేసే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇటీవల నిర్వహించిన వేలంలో స్థలాలు కొనుగోలు చేసిన వారి నుంచి కూడా వాయిదా బకాయిలను వసూలు చేయాలన్నారు. రెవెన్యూ విభాగం కూడా దూకాణదారుల నుంచి నెలసరి అద్దెలను సకాలంలో రాబట్టాలని, కట్టని వారికి నోటీసులు ఇవ్వాలని ఆదేశించారు. అనంతరం సాంకేతిక విభాగంపై చేసిన సమీక్షలో సంస్థకు చెందిన వాణిజ్య సముదాయాలు, పార్కుల్లో నిర్వహణలను ప్రతి ఒక్క పనినీ క్షుణ్ణంగా పరిశీలించిన తరువాత మాత్రమే అంచనాలను రూపొందించాలన్నారు. దుకాణాలు అద్దెకు తీసుకున్న వారు.. వారికి కేటాయించిన స్థలంలో మాత్రమే వ్యాపారం నిర్వహించుకోవాలని, ఆక్రమణలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో కార్యదర్శి మురళీకృష్ణ, ప్రధాన ఇంజనీర్ వినయ్ కుమార్, ముఖ్య గణాంకాధికారి హరిప్రసాద్, పర్యవేక్షక ఇంజనీర్ భవానీ శంకర్, కార్యనిర్వహక ఇంజినీర్లు రామరాజు, దుర్గా ప్రసాద్, పరిపాలనాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

విశాఖకు మల్లన్న తలపాగా

- విజయనగరం జిల్లా నుంచి శ్రీశైలానికి..
- పాగా దర్శనం ఎంతో విశిష్టత
- అల్లిపురంలో ప్రత్యేక పూజలు
- శివరాత్రి రోజు శ్రీశైలంలో అలంకరణ



పెనుబాక నుంచి వచ్చిన పాగాతో శివ భక్తుడు అప్పలనాయుడు, పాగా నేసిన నేతన్నలు, భక్తులు

అల్లిపురం: సంప్రదాయ ఉత్సవాలలో భాగంగా శ్రీశైలంలో పాగా దర్శనానికి ఎంతో విశిష్టత ఉంది. ఈ దర్శనం ముక్తిదాయకమని వేద పండితులు చెబుతుంటారు. మల్లన్న తలపాగా ధారణ చూసి తరించేందుకు లక్షల మంది భక్తులు అక్కడికి చేరుకుంటారు. మహాశివరాత్రి నాడు అర్ధరాత్రి లింగోద్భవం తర్వాత.. భక్తులు పెద్ద సంఖ్యలో మల్లన్న పాగా దర్శించుకుంటారు.

దిగంబరంగ ఆలయ శిఖరం నుంచి నవనందులకు చేనేత వస్త్రాన్ని తలపాగా ధరింపజేసే మహభాగ్యం ఉత్తరాంధ్ర జిల్లాలకు కలగడం అదృష్టంగా భావించవచ్చు. ఆ అదృష్టం విజయనగరం జిల్లా పెనుబాక గ్రామానికి చెందిన ఆశపు రవణ దంపతులతో పాటు సంతకవిటి మండలం మందరాడకు చెందిన ముతికి వీర్రాజు దంపతులకు కలగడం విశేషం. ఈ మేరకు వారు విజయనగరం కలెక్టర్ ద్వారా అనుమతి తీసుకుని పాగాను నేశారు.

భక్తి శ్రద్ధలతో..

వైకుంఠ ఏకాదశి రోజున ప్రారంభించిన పాగా నేతను ముక్కనుమ రోజు నుంచి సిద్ధం చేస్తారు. అప్పటి నుంచి కఠిన నియమ నిష్టలతో నిత్య శివనామస్మరణతో మాలధరించి, పూజలు నిర్వహిస్తూ ఈ తలపాగాను తయారు చేస్తారు. తెల్లని వస్త్రాన్ని నియమ నిష్టలతో సంవత్సరానికి 365 రోజులకు గాను రోజుకు మూర చొప్పున 365 మూరలు వస్త్రాన్ని నేయడం విశేషం. అనంతరం పాగా మొత్తాన్ని శివలింగం ఆకారంలో చుట్టి, విశేషంగా అలంకరించి పూజలు నిర్వహిస్తారు. ఈ సందర్భంగా భజనలు చేపడతారు.

అల్లిపురం చేరిన పాగా

అలా నియమ నిష్టలతో తయారు చేసిన పాగాను విశాఖలో అల్లిపురం, బృందావన్ జంక్షన్ వద్ద గల ప్రముఖ శివ భక్తుడు పీలా వెంకట చిన అప్పలనాయుడు ఇంటికి ఆదివారం ఒకటి, సోమవారం ఒకటి చేరుకున్నాయి. వాటికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం నగరంలో పలు ఆలయాల్లో పూజలు నిర్వహించిన అనంతరం శ్రీశైలం తరలించన్నారు.

వైకుంఠ ఏకాదశి నుంచి..



వైకుంఠ ఏకాదశి నుంచి పాగా నేత ప్రారంభించాం. అప్పటి నుంచి ఏడాదిలో 365 రోజులకు గాను 365 మూరల పాగాను అల్లాం. నేత పూర్తయిన తరువాత ఇంట్లో ప్రత్యేక పూజలు చేపట్టాం. శివ భక్తుల కోరిక మేరకు విశాఖ తీసుకువచ్చాం. ప్రతి ఏడాది ఇదే విధంగా చేసి శ్రీశైలం తీసుకువెల్తుంటాం. ఇది శివయ్య మాకు ఇచ్చిన అద్భుత అవకాశం.

–ఆశపు రమణ, పునుబాక, విజయనగరం

మా పూర్వజన్మ సుకృతం



45 రోజుల పాటు కష్టపడి చేతితో నేసిన పాగా. శివయ్య ఆదేశం మేరకు ప్రతి ఏడాది పాగా నేసి శ్రీశైలం తీసుకువెళుతుంటాం. ఈ ఏడాది ఇద్దరికి అనుమతులు ఇచ్చారు. పాగాను నేయడం మా పూర్వ జన్మఫలంగా భావిస్తున్నాం. నియమ నిష్టలతో పూజలు చేసి నేత నేశాం. ప్రతి ఏడాది విశాఖ తీసుకువచ్చి, ఇక్కడ నుంచి శ్రీశైలం వెళ్తుంటాం.

– ముతుకుటి వీర్రాజు దంపతులు, మందరాడ, విజయనగరం

నాలుగేళ్లుగా..



నాలుగేళ్లుగా విజయనగరం జిల్లా పెనుబాకలో నేత నేసిన పాగాను అల్లిపురంలో మా ఇంటికి తీసుకువస్తాం. ఇక్కడ పూజలు చేసిన అనంతరం ఆలయానికి తరలిస్తాం. విశాఖలో శివయ్య భక్తులు దర్శించుకున్న అనంతరం పాగాను ప్రత్యేక వాహనంలో శ్రీశైలం తరలిస్తాం. అక్కడ దేవస్థానం కార్యాలయంలో అప్పగించిన అనంతరం శివరాత్రి రోజున లింగోద్భవ కాలంలో నిరాకారుడైన ఆ మహాదేవుడ్ని స్మరిస్తూ శ్రీశైలం ఆలయం శిఖరం నుంచి నవనందులకు తలపాగా చుడతారు. ఆ అదృష్టం మాకు కలగడం చాలా ఆనందంగా ఉంది.

– పీలా వెంకట చిన అప్పలనాయుడు, శివ భక్తులు, అల్లిపురం